క్లుప్తంగా

ఘనంగా జూబ్లీ 2025 ప్రారంభ వేడుకలు



ప్రార్థన చేస్తున్న బిషప్ సగిలి ప్రకాశ్

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట కరుణగిరిలో గల దివ్య కారుణ్య మహా దేవాలయంలో ఆదివారం జూబ్లీ 2025 సంవత్సర ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిషప్ సగిలి ప్రకాశ్ ప్రత్యేక ప్రార్థనలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ ఏడాది ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అందరిపై దైవ కృప నిండి ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్‌లు వీజీ. శౌరి, ఐసాక్, జోన్నెస్, మాథ్యూ విజయ్, బి.జయరాజు, సురేష్, జార్జ్ ఆంథోని, శాంతికుమార్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంకు చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు కొమ్ము భిక్షం ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. భిక్షం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆదివారం గ్రామంలో భిక్షం సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భిక్షం మృతి పీడిత, తాడిత, దళిత వర్గానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సుదర్శన్, గొర్రెపాటి రమేష్, ఎం.ఉప్పలయ్య, రాంబాబు, మోహన్‌రావు, సుబహాన్, పి.శ్రీకాంత్, పుల్లయ్య, రామయ్య, ఐ.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ 'భోజన' బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

కూసుమంచి: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ బిల్లులతో పాటు వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం కూసుమంచిలో నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని వండే కార్మికులకు బిల్లులు పేరుకుపోయాయని, వంట వండేందుకు అప్పులు చేస్తూ కూరగాయలు, గుడ్లు కొనాల్సి వస్తుందన్నారు. బిల్లుల సకాలంలో రాకపోవడంతో కొందరు తమ బంగారు ఆభరణాలను కూడా తాకట్టు పెట్టి భోజనం వడ్డిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కార్మికుల ఇబ్బందులు గుర్తించి వెంటనే బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, కార్యదర్శులు నిమ్మటూరి రామకృష్ణ, గుండెపొంగు మల్లేష్, కార్మికులు పాల్గొన్నారు.

నెలాఖరు కల్లా సర్వే పూర్తి చేయాలి

కూసుమంచి: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నెలాఖరు కల్లా పూర్తి చేయాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు తమ సిబ్బందికి వివరాలను అందించాలని, సర్వేకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని కోరారు. మండలంలో మొత్తం 16,325 గృహాలకు గానూ 85 శాతం మేర సర్వే పూర్తయినట్లు ఎంపీడీఓ తెలిపారు.

బచ్చోడులో సంత ప్రారంభించాలని వినతి

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో జనవరి 1 నుంచి సంత (అంగడి) ప్రారంభించాలని కోరుతూ ఆదివారం గ్రామ కార్యదర్శికి అఖిలపక్షం నాయకులు వినతి పత్రం అందజేశారు. గ్రామం అభివృద్ధిని కోరుతూ చుట్టుపక్కల అనేక గ్రామాలకు కూడలిగా ఉన్నందున ప్రజల సౌకర్యార్థం ప్రతీ బుధవారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప 2
వినోద	ముఫాసా
సాయిరాం	విడుదల 2
ఆదిత్య	పుష్ప 2
శ్రీనివాస	మాక్స్, బచ్చలమల్లి
సినీగెలాక్సీ	యూఐ

- ఖమ్మంగాంధీచౌక్

ప్రణాళిక.. చేయాలిక!



ఈ నెల 23న నగరంలోని ఓ గోదాములో నిల్వ ఉన్న నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసిన కేఎంసీ సిబ్బంది

నగరంలో కోరలు చాస్తున్న ప్లాస్టిక్ భూతం

- గుట్టలుగా పేరుకుపోతున్న కవర్లు
- కట్టడిలో అధికారుల అలసత్వం
- నామమాత్రంగా సీజ్, జరిమానాలు
- అవగాహన కల్పించడంలో విఫలం

ఖమ్మంమయూరిసెంటర్: పర్యావరణాన్ని నాశనం చేసేలా ప్లాస్టిక్ కోరలు చాస్తోంది. ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాలు, డ్రెయినేజీలు, పెంట కుప్పలు ఇలా ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా దర్శనిమిస్తోంది. పెరిగిపోతున్న కాలుష్యం, భూతాపాన్ని నివారించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం 2022 ఆగస్టు నుంచే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేఎంసీలో నాటి నుంచి అధికారులు 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, వస్తువులను బ్యాన్ చేస్తూ వస్తున్నారు.

మళ్లీ పెరిగిన వినియోగం..

కేఎంసీలో సింగిల్ యూజ్డ్, నిషేధిత ప్లాస్టిక్ వినియోగం మళ్లీ పెరిగింది. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిన ఏడాది పాటు కఠినంగా వ్యవహరించిన అధికారులు ఆ తర్వాత అలసత్వం ప్రదర్శించడంతో కిరాణం, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్లు, రైతు బజార్‌లు, వీధి వ్యాపారులు, పలు దుకాణాల్లో విచ్చలవిడిగా వీటిని వినియోగిస్తున్నారు. అంతేకాక ప్లాస్టిక్‌ను ఉపయోగించి తయారు చేసే కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువులను గోదాములు నగరంలో భారీగానే ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీంతో నగరంలో రోడ్ల వెంట, ఖాళీ స్థలాలు, డ్రెయినేజీల్లో ఎక్కడ చూసినా వాడి పడేసిన ప్లాస్టిక్ సంబంధిత వస్తువులే దర్శనమిస్తున్నాయి.

తూతూమంత్రంగానే..

కేఎంసీలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై తనిఖీలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. వీటి నిషేధానికి ప్రత్యేకంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌ను కేటాయించినా.. ఆయన ఇతర పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీని వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రచారం చేయడంలో విఫలమైనట్లు తెలుస్తోంది. సీజ్ చేయాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి ఫిర్యాదులు అందితే నామమాత్రంగానే సీజ్ చేసి జరిమానాలు విధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కూడా భారీ మొత్తంలో ప్లాస్టిక్‌ను గుర్తించి నామమాత్రంగానే సీజ్ చేసి వ్యాపారికి జరిమానా విధించారనే ఆరోపణలు ఉన్నాయి. కేఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని, సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారనే వాదనలు ఉన్నాయి.

నగర పాలక సంస్థ వివరాలిలా..

- మొత్తం డివిజన్లు – 60
- జనాభా – 4 లక్షలు
- రోజు వారీగా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు – 180 టన్నులు
- రోజూ వారీగా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ – సుమారు 30 టన్నులు
- ఇందులో సింగిల్ యూజ్డ్ (120 మైక్రాన్ల కన్నా తక్కు మందం కలిగిన) ప్లాస్టిక్ – 10 టన్నులు
- ప్లాస్టిక్ అమ్మే దుకాణాలు – 40కు పైగా
- ప్రస్తుతం దుకాణాల్లో నిల్వ (అంచనా) – సుమారు 500 టన్నులు

నిషేధిత వస్తువులు..

- ప్లాస్టిక్ పుల్లతో కూడిన ఇయర్ బడ్స్
- ప్లాస్టిక్ జెండాలు
- చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌ల్లో వాడే ప్లాస్టిక్ పుల్లలు
- స్వీట్ బాక్స్‌లు, ఇన్విటేషన్ కార్డులు, సిగరేట్ ప్యాకెట్లపై ఉండే ర్యాపింగ్, ప్లాస్టిక్ స్టిక్స్
- బెలూన్లలో వాడే ప్లాస్టిక్ పుల్లలు
- డెకరేషన్ కోసం వాడే థర్మాకోల్
- ప్లేట్లు, నంచులు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, స్పూన్లు, కత్తులు, స్ట్రా, ట్రేలు

జనవరి నుంచి ప్రత్యేక ప్రణాళిక..



నిషేధిత ప్లాస్టిక్ రహిత నగరంగా ఖమ్మాన్ని మార్చేందుకు జనవరి నుంచి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ప్లాస్టిక్ వినియోగిస్తే సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. మాకున్న మొదటి ప్రాధాన్యతలో వ్యర్థాల నిర్వహణతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం. జనవరి నుంచి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని సుందరయ్య భవనంలో జరిగిన సీపీఎం పాలేరు డివిజన్ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులకు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని, రైతు భరోసా ఎలాంటి షరతులు లేకుండా మంజూరు చేయాలని, సంపూర్ణ రైతు రుణమాఫీ అమలు చేయాలని పేర్కొన్నారు. పాలేరు డివిజన్‌లో సీపీఎం బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమాల్లోకి రావాలని, ఉద్యమాల్లో మహిళల పాత్ర మరింత పెరగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.రమేష్, ప్రతాప్‌నేని వెంకటేశ్వర్లు, బిక్కసారి గంగాధర్, నాగేశ్వరరావు రచ్చ నర్సింహారావు, పి.మోహన్‌రావు, పి.వెంకటరమణ, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..



ఖమ్మం మామిళ్లగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న సన్నె ఉదయ్‌ప్రతాప్

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ కోరారు. ఆదివారం నగరంలోని బుర్హాన్‌పురంలో జరిగిన బీజేపీ మండల బూత్ కమిటీల నియామక సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ.వీ.రమేష్, సీనియర్ నాయకులు శీలం పాపారావు, మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి, జ్వాలా నర్సింహారావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

నేలకొండపల్లి: బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని బూత్ కమిటీలను నియమించామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు గెల్లా సాయి, సయ్యద్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ లింక్ కెనాల్‌లోకి దూసుకెళ్లిన కారు

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం వద్ద అతి వేగంగా వచ్చిన ఓ కారు సాగర్‌లింక్ కెనాల్‌లోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం వైపు నుంచి రెడ్డిపల్లి వైపు వస్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి రోడ్డు వారగా ఉన్న లింక్ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసి గాయాలు కావడంతో 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది.

ఆత్మీయ సమ్మేళనాలు..



ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం



కొక్కిరేణి పాఠశాలలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- **ఖమ్మం అర్బన్:** కామేపల్లి మండలం పండితాపురం, కొమ్మినేపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఖమ్మం నగరంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం వారంతా చెరుకూరి వారి మామిడితోటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు.

కొక్కిరేణి పాఠశాల పూర్వ విద్యార్థులు..

- **తిరుమలాయపాలెం:** మండలంలోని కొక్కిరేణి పాఠశాలలో పదో తరగతి(1984–85 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువురు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 40 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మచ్చ మధు, బెల్లం వేణు, కరుణ, కృష్ణకుమారి, పూర్ణచందర్‌రావు, జానీమియా, సామ్రాజ్యం, రామయ్య, సీత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఆదివారానికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్వతంత్ర సమర యోధుల చిత్రాలతో మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహబూబ్ పాషా, వీరస్వామి, అనిల్, ఇస్మాయిల్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, కేజీబీవీ ఉద్యోగులు సమ్మె చేస్తున్న క్రమంలో ప్రభుత్వం సమస్య పరిష్కరించకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సరైన విధానం కాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, ఎస్.విజయ్‌లు పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేలకొండపల్లి: మండల కేంద్రంలో స్థానిక భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 60 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వైరాలోని కంటి ఆస్పత్రి ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తెల్లగొర్ల చిన్న లింగస్వామి, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, గంజికుంట్ల వెంకన్న, దండా రవీంద్రబాబు, గెల్లా జగన్‌మోహన్‌రావు, వెల్లంపల్లి శ్రీనివాస్, నెల్లూరి వీరబాబు, యలమద్ది లెనిన్, దుర్గారావు, యుగంధర్, రేలా నరసింహారెడ్డి, ఏటుకూరి రామారావు, షేక్ ఖాసింసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ కుటుంబం చెంతకు..



కుటుంబసభ్యులకు అప్పగించిన శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్: ఇటీవల ఖమ్మం పాత బస్టాండ్‌లో రాత్రిపూట ఓ మతిస్థిమితం లేని మహిళ బస్సులో చొరబడి ప్రయాణికులను ఎవరిని ఎక్కనీయకుండా ఇబ్బంది పెట్టింది. సమాచారం అందుకున్న ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చి సదరు మహిళను అప్పగించగా.. ఆమె కోలుకుని తన పేరు నాగమణి అని, ఇల్లెందు మండలం వెంకటాపురం అని తెలియజేసింది. అంతేకాక తన తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, కృష్ణ అని, కోయ జాతికి చెందిన వారమని చెప్పగా వారు ఇక్కడకు రాలేని పరిస్థితుల్లో ఉన్న నేపథ్యాన ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



దిశా నిర్దేశం చేస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మంవ్యవసాయం: నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు ప్రారంభమయ్యాయి. నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లలో ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే పనిలో విద్యుత్ యంత్రాంగం నిమగ్నమైంది. ఆదివారం నగరంలో నిర్వహించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఎ.సురేందర్ పర్యవేక్షించారు. కాగా, ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ 11 కేవీ ఫ్యూస్ సెట్స్ క్లాంపులకు మోనోప్లాస్ట్‌ను ఇన్సూలెన్స్‌గా పేస్టు చేసే కార్యక్రమం కొనసాగుతోంది. ఖమ్మం నగరంలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్, ఆర్‌జీకే ఫీడర్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఫీడర్లలో ఈ ప్రక్రియ పూర్తి కాగా, గాంధీచౌక్ సబ్ స్టేషన్ పరిధిలో గుట్టలబజార్, ఎస్ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలో వీడీవోస్ కాలనీ ఫీడర్‌లలోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఫ్యూస్ సెట్ల క్లాంపులకు మిశ్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను ఎస్ఈతో పాటు ఖమ్మం టౌన్–1, 2 ఏడీఈలు నాగార్జున, యాదగిరి, టౌన్–1, 3 ఏఈలు క్రాంతికిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ అంతరాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఈ అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

- **ఖమ్మంరూరల్:** మండలంలోని నాయుడుపేటలో గల పీవీఆర్ గార్డెన్‌లో జిల్లా గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్‌కు చెందిన డైరీ 2025ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆదివారం ఆవిష్కరించారు. అదే విధంగా ఇదే యూనియన్‌కు చెందిన క్యాలెండర్లను కాంగ్రెస్ జిల్లా నాయకుడు సాధు రమేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రానైట్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌కె.జానీ, అదాలత్ నరేందర్, వెంపటి ఉపేందర్, సూనావత్ కిషన్, నవీన్‌కుమార్, రహీం, బూర్ల కృష్ణ, కత్రం శేషగిరి, నర్సింహారావు, వడ్లకొండ శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, ఢిల్లీ ప్రసాద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మం మామిళ్లగూడెం:** తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘం 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆదివారం ఖమ్మం జిల్లా సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, పూర్వ రాష్ట్ర బాధ్యులు జె.లక్ష్మీనారాయణ, ఆర్.శ్రీరాములు, వి.మల్లికార్జునరావులు మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా ఈ డైరీని రూ.150లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం నాగేశ్వరరావు, గోపీచంద్, పి.యూసుఫ్, మాధవరావు, కె.సీత, వీరభద్రం రామారావు, ఆలీఖాన్, వై.శ్రీనివాసరావు, ఉమేష్, రాజేంద్రప్రసాద్, కోటేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

ఖమ్మం అర్బన్: రాజకీయాల్లో యాదవులకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవులు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత యాదవ మహాసభ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారి సింహాద్రి, రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న తదితరులు మాట్లాడుతూ.. గొర్రెల పెంపకందారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. బీసీలలో అధిక జనాభా కలిగి, రాజకీయ చైతన్యం కలిగి ఉన్న యాదవులకు రాష్ట్రస్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైన యాదవులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో దుబాకుల శ్రీనివాస్, దుబాకుల వెంకటేశ్వర్లు, గూదే భద్రయ్య, చేతుల నాగేశ్వరరావు, బొల్లి కొమరయ్య, మొరిమేకల కోటయ్య, బండారి ప్రభాకర్, పాదిలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డ్రైవర్ల సంఘం బాధ్యులు

- **ఖమ్మం అర్బన్:** చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ ఖమ్మం అర్బన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడిపుడి శ్రీనివాసరావు, బి.రవికిరణ్‌లు కోరారు. ఆదివారం పీఆర్‌టీయూ కార్యాలయంలో ఖమ్మం అర్బన్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ బిల్లులు, సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో కనీసం రెండు డీఏలను సంక్రాంతి కానుకగా ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు పారుపల్లి వెంకటేశ్వరరావు, మలీదు రాములు, గోపాలస్వామి, నాగేంద్రబాబు, రంగారావు, దర్గయ్య, వెంకటకుమారి, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మం సహకారనగర్:** పెండింగ్ బిల్లులు త్వరితగతిన మంజూరు చేసేలా కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీజీకే మూర్తి, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సలీం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వేణుగోపాల్, నాయకులు గంగన్న, జి.రాములు, నాగరాజు, రామారావు, ఎస్‌వీ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, కోకన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ'ను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ శత వసంతోత్సవాల సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో ఈ నెల 30న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్మల జితేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఖమ్మం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బహిరంగసభలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఎరుపు దుస్తులు ధరించి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు క్లైమెంట్, కొండపర్తి గోవిందరావు, సింగ్ నరసింహారావు, పోటు కళావతి, సీహెచ్.సీతామాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య గ్యాస్ ఏజెన్సీలను తరలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ఖమ్మం మామిళ్లగూడెం: జనావాసాలకు దూరంగా ఉండాల్సిన వివిధ కంపెనీల గ్యాస్ ఏజెన్సీ గోదాములు జనావాసాల మధ్యే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ఆరోపించారు. ఆదివారం స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఖమ్మం నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ప్రమాణాలు పాటించకుండా గ్యాస్ సిలిండర్ల వ్యాపారం కొనసాగిస్తున్నా.. సివిల్ సప్లయిస్ అధికారులు స్పందించడం లేదని, వెంటనేనగరంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీ గోదాములను ఊరు వెలుపలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ వ్యవస్థను ఖూనీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూ.. కేంద్రీకృత పాలనకు ఉపయోగించుకోవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకొస్తున్నారని, ఈ విధానంపై పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాలన్నారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం పెత్తనం చేయాలని చూస్తుందని, దాన్ని పూర్తిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి యూసుఫ్, నాయకులు కె.శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, జిక్కుల భరత్, సత్తార్‌మియా, వి వెంకటేష్, కొమరయ్య, చిలకల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.